సాక్షి ఆదిలాబాద్

బుధవారం, 11, అక్టోబర్, 2023



పండుగకు ప్రత్యేక బస్సులు

నష్టాల్లో ఉన్న సంస్థను గట్టెక్కించేందుకు ఆర్టీసీ ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటోంది. దసరాకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు చర్యలు చేపడుతోంది. 10లో▸

బేల తహసీల్దార్‌గా సవాయిసింగ్



బేల: తహసీల్దార్‌గా సవాయిసింగ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన వేణుగోపాల్ మావలకు బదిలీ అయ్యారు. నూతన తహసీల్దార్‌కు ఆర్ఐలు నారాయణ, గీత పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
25.0/22.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం కనిపిస్తుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ఆరుగురు నాయబ్ తహసీల్దార్ల బదిలీ



కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో ఆరుగురు నాయబ్ తహసీల్దార్లకు స్థానచలనం కలిగింది. జిల్లాలో పనిచేస్తున్న ఐదుగురితోపాటు నిర్మల్ జిల్లా నుంచి వచ్చిన మరొకరికి పోస్టింగ్ కల్పిస్తూ కలెక్టర్ రాహుల్‌రాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మల్ జిల్లాలో పనిచేస్తున్న అరుణను మావల నాయబ్ తహసీల్దారుగా నియమించగా, ఎస్సీ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఏ.మల్లేశ్‌ను బోథ్‌కు, పౌర సరఫరాల శాఖలో పనిచేస్తున్న జే.ఉపేందర్‌ను సిరికొండకు, పి.ప్రభాకర్‌ను తలమడుగుకు, డీవైఎస్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న సీహెచ్.విలాస్‌ను గాదిగూడ మండలానికి బదిలీ చేయగా, ఎన్‌ఫోర్స్‌మెంట్ నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రాథోడ్ బాబుసింగ్‌ను ఆదిలాబాద్ ఆర్డీవో కార్యాలయానికి డిప్యూటేషన్‌పై నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న క్షమాదేశ్‌పాండే

తాంసి: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. మానసిక ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు అశోక్, ఉమేష్, ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

మండలకేంద్రంలోని కళాశాలకు వచ్చే తమకు బస్సు సౌకర్యం కల్పించాలని క్షమాదేశ్‌పాండేకు వినతిపత్రం అందజేశారు. భీంపూర్ నుంచి తాంసి మండలకేంద్రం మీదుగా ఆదిలాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు.

'ఆశ'ల సమ్మె విరమణ



డిప్యూటీ డీఎంహెచ్‌వోకు వినతి అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న ఆశ కార్యకర్తలు తాత్కాలికంగా సమ్మె విరమిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాత తెలిపారు. విధుల్లో చేరుతున్నట్లు మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధనకు వినతి సమర్పించారు. సమస్యలు పరిష్కరిస్తామని వైద్యారోగ్యశాఖ డైరెక్టర్ హామీ ఇచ్చారని, దీంతో సమ్మె విరమించినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆశ కార్యకర్తలకు కనీసవేతనం రూ.18వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన సందర్భంగా హెల్త్‌డైరెక్టర్ హామీ మేరకు విధుల్లో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అరుణ, స్వరూప, పార్వతి, ఆశ, మాధవి, సుజాత, లక్ష్మి, లింగాల చిన్నన్న, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న అమిత్ షా, చిత్రంలో తరుణ్‌చుగ్, ఈటల, కిషన్‌రెడ్డి, బాపూరావు, సంజయ్, మహేశ్వర్‌రెడ్డి, పాయల్‌శంకర్, రమాదేవి తదితరులు



జనగర్జన జోష్..

- ఎన్నికల కదనరంగంలోకి కమలదళం
- యుద్ధం ప్రారంభించండి.. అంటూ నేతల పిలుపు
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై విమర్శలతో సాగిన అమిత్‌షా ప్రసంగం
- బీజేపీని గెలిపించాలంటూ రాష్ట్ర నేతల పిలుపు
- జనం నుంచి పాజిటివ్ రెస్పాన్స్..
- పార్టీ శ్రేణులు, నేతల్లో ఉత్సాహం
- ఆదిలాబాద్ సభ సక్సెస్



↑ కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన



సభకు తరలివస్తున్న జనం →

సాక్షి, ఆదిలాబాద్ /ఆదిలాబాద్ టౌన్: ఎన్నికల షెడ్యూల్ తర్వాత బీజేపీ రాష్ట్రంలో తొలిసారిగా తలపెట్టిన జనగర్జన బహిరంగ సభ సక్సెస్ అయింది. ఈ సభతోనే కమలదళం ప్రచారం షురూ చేసింది. యుద్ధం ప్రారంభించండి అంటూ నేతలు పిలుపునిచ్చారు. సైరన్ మోగిందని.. ముందుకు కదలాలన్నారు. ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభలో పాల్గొని శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. బీఆర్ఎస్ సర్కారు తీరుపై విమర్శిస్తూ, కాంగ్రెస్ హయాంలో యూపీఏ సర్కార్ అవినీతిని ఎండగడుతూ షా ప్రసంగం సాగింది. డిసెంబర్ 3న రాష్ట్రంలో కమలం సర్కార్‌ను తీసుకొద్దామంటూ ఆయన పిలుపునిచ్చారు.

భారీగా తరలివచ్చిన జనం..

ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాల మైదానంలో మంగళవారం బీజేపీ జనగర్జన సభ నిర్వహించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల పరిధి నుంచి జనాన్ని సమీకరించారు. సుమారు 45వేల వరకు తరలి రావడంతో పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం కనిపించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ చుగ్, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎంపీలు వివేక్ వెంకటస్వామి, రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్, పడకంటి రమాదేవి, డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ చిట్యాల సుహాసినిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై విమర్శలు..

అమిత్‌షా మధ్యాహ్నం 3 గంటలకు వేదిక వద్దకు చేరుకున్నారు. అంతకుముందు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ మీదుగా హెలిక్యాప్టర్ ద్వారా ఆయన ఆదిలాబాద్ చేరుకున్నారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో దిగారు. అక్కడినుంచి వాహనాల కాన్వాయ్ ద్వారా సభ ప్రాంగణానికి చేరుకున్నారు. వేదికపై షా ఆసీనులైన తర్వాత కేవలం ముగ్గురే ఎంపీ సోయం, సంజయ్, కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఆ తర్వాత అమిత్‌షా ప్రసంగించారు. బీఆర్ఎస్ సర్కార్ తీరును ఎండగడుతూ.. రాష్ట్రంలో డిసెంబర్ 3న కమలం సర్కార్ ఏర్పడబోతుందని ధీమా వ్యక్తం చేశారు. యూపీఏ సర్కార్ హయాంలో లక్షల కోట్ల అవినీతిని ఎండగడుతూ, ప్రస్తుతం ఎన్నికలు రావడంతో కాంగ్రెస్ నాయకులు జనాల్లోకి వచ్చి ఏదో చేస్తామని చెబుతున్నారని షా తన ప్రసంగంలో విమర్శించారు. మజ్లిస్ కనుసన్నల్లో బీఆర్ఎస్ సర్కార్ కొనసాగుతుందని చెబుతూ ఇవాళ్టి రజాకారుల పాలన నుంచి బీజేపీతోనే రక్షణ అంటూ ఆ నేతలు చెప్పుకొచ్చారు.

జనం ఉత్సాహం..

సభకు భారీగా జనం తరలిరావడంతో హోంమంత్రితో పాటు జాతీయ, రాష్ట్రనేతల్లో ఉత్సాహం కనిపించింది. షా ప్రసంగం సమయంలో ప్రజలను ప్రశ్నించడం, దానికి వారు ఉత్సాహంగా స్పందించడం ఆకర్షించింది. కేసీఆర్ సర్కార్ మళ్లీ రావాలా.. అని ఆయన ప్రశ్నించినప్పుడు వద్దు అని జనం అనడం గమనార్హం. అలాగే మోదీ నేతృత్వంలో కమలం పార్టీ ఇక్కడ అధికారంలోకి రావాలా అని అడిగినప్పుడు రావాలి అంటూ స్పందించారు. అలాగే రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రసంగ సమయంలోనూ జనం నుంచి స్పందన కనిపించింది. సంజయ్ మాట్లాడుతున్నప్పుడు జనం హోరెత్తారు. ఆయన మాట్లాడిన ప్రతీ అంశానికి సభ ప్రాంగణం దద్దరిల్లిపోయింది. గంట పాటు సభలో ఉన్న షా సాయంత్రం 4 గంటలకు ఇక్కడినుంచి తిరిగి వెళ్లారు.

సభ.. సైడ్‌లైట్స్

- కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సరిగ్గా మూడు గంటలకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియానికి చేరుకోగా కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నాయకులు స్వాగతం పలికారు.
- అమిత్ షా సభ వేదికకు చేరుకునే ముందు స్వామీజీల ఆశీర్వచనాలు స్వీకరించారు.
- బాసర జ్ఞాన సరస్వతి, నాగోబా దేవత, జైనథ్ శ్రీ లక్ష్మీనారాయణ స్వామి, కుమరం భీమ్‌లను స్మరిస్తూ అమిత్ షా ప్రసంగాన్ని ప్రారంభించారు.
- జనం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. కూలర్లు ఏర్పాటు చేసినప్పటికీ వేడికి అవస్థలు తప్పలేదు. వాటర్ బాటిళ్ల కోసం ఎగబడ్డారు.
- సభలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జానపద కళాకారుల నృత్యాలు అలరించాయి.
- పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, సీఎం కేసీఆర్ గురించి వ్యంగ్యంగా మాట్లాడుతున్నప్పుడు భారీ స్పందన వచ్చింది. సమావేశం అనంతరం ఆయనను కలిసేందుకు శ్రేణులు ఆసక్తి చూపారు. కరచాలనం చేసేందుకు ఎగబడ్డారు.
- సభ నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ప్రజలను తనిఖీ చేస్తూ సభ ప్రాంగణంలోనికి అనుమతించారు.
- సభకు జనం బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సుమారు 45వేల మంది వరకు హాజరు కావడంతో ప్రాంగణం కిక్కిరిసింది. – ఆదిలాబాద్



బండి సంజయ్‌తో కరచాలనం చేసేందుకు కార్యకర్తల ఉత్సాహం

24 గంటల కరెంటిస్తే పదవికి రాజీనామా చేస్తా



తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు వస్తాయని, రైతుల బాధలు తీరుతాయని అనుకున్నాం. అమరుల త్యాగాల పునాదిపై తెలంగాణ ఏర్పడితే కేసీఆర్ కుటుంబం ఒక్కటే పదవులను అనుభవిస్తుంది. 24 గంటల పాటు ఉచిత కరెంటు ఇస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతుంది. 9 గంటలు కూడా సరఫరా కావడం లేదు. 24 గంటల పాటు కరెంటు ఇస్తే నా పదవికి రాజీనామా చేస్తా. కేసీఆర్‌ను బొంద పెట్టేంత వరకు ప్రజలు నిద్రపోవద్దు. హైదరాబాద్‌లో నిర్మించే రింగ్ రోడ్డు రూ.7,600 కోట్లకు అమ్ముకున్నాడు. సక్రమంగా రైతుబంధు కూడా అమలు కావడంలేదు. జనాభాలో ఒక శాతం లేని వారు పదవులు అనుభవిస్తున్నారు.

– ఈటల రాజేందర్, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్

కేసీఆర్ నుంచే భాష నేర్చుకున్నా..



ముఖ్యమంత్రి కేసీఆర్ నా గురువు. ఆయన నుంచే భాష నేర్చుకున్నా. సీఎం సార్ కొద్ది రోజుల నుంచి కనిపించడం లేదు. ఆయనకు ఏమైంది. ఆయన నిండు నూరేళ్లు సల్లగా ఉండాలె. ఆయన కొడుకు ఆయనకు ఏం చేస్తుండో తెలియాలి. ఆయనకు రక్షణ కల్పించండి. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ చేసి నిరుద్యోగుల ఉసురు పోసుకున్నారు. దీనికి ముఖ్యమంత్రే బాధ్యత వహించి రాజీనామా చేయాలి. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఆచరణకు నోచుకోని హామీలు ఇస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నాయి. బీజేపీ మతతత్వ పార్టీ కాదు.. రాష్ట్ర ప్రభుత్వం భైంసాలో పీడీయాక్ట్‌లు నమోదు చేయించింది. హిందువులపై దాడులు చేస్తే సహించేది లేదు. ఎంఐఎం లుచ్చా పార్టీ.. వారి బట్టలు తీసి ఊరేగిస్తాం. పాకిస్తాన్ జై అనే వారిని పాతిపెడతాం.

– బండి సంజయ్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

అధికారంలోకి రావడం ఖాయం



రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం. బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాలం చెల్లింది. ఆదిలాబాద్–నాగ్‌పూర్, ఆదిలాబాద్–హైదరాబాద్ వరకు రైల్వేమార్గం ఏర్పాటు కోసం ప్రధానమంత్రి మోదీ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. త్వరలో రైల్వేలైన్ పనులు ప్రారంభమవుతాయి. రూ.5వేల కోట్ల నిధులు మంజూరు చేసేందుకు ప్రధాని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో పిట్‌లైన్ పనులు జరుగుతున్నాయి.–సోయం బాపూరావు, ఆదిలాబాద్ ఎంపీ

సీఎం ఫామ్‌హౌస్‌కే పరిమితం



రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితం అవుతున్నారు. ఆదిలాబాద్ జనగర్జన సభలోని నినాదాలు కేసీఆర్‌తో పాటు దారుస్సలామ్‌లో ఉన్న ఎంఐఎం నాయకులకు వినిపించాలి. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలి.

– కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

సభ ముగిసింది.. ఫ్లెక్సీ తొలగింది

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో నిర్వహించిన ఆదిలాబాద్ జనగర్జన సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హాజరైన విషయం తెలిసిందే. సభ నేపథ్యంలో పట్టణంలో భారీగా ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేశారు. అయితే ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మోడల్ కోడ్ అమలులో ఉంటుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. 24 గంటల వ్యవధిలో ప్రతి ప్రభుత్వ భవనాల్లో వివిధ రాజకీయ పార్టీలకు, నాయకులకు సంబంధించిన హోర్డింగులు, ఫోటోలు, వాల్ రైటింగ్స్ తొలగించాలని, 48 గంటల వ్యవధిలో పబ్లిక్ ప్రాపర్టీస్ వద్ద, 72 గంటల్లోగా ప్రైవేట్ స్థలాలలో హోర్డింగులు, ఫ్లెక్సీలు ఫొటోలు తొలగించాలనే ఆదేశాల నేపథ్యంలో మంగళవారం అమిత్ షా సభ జరిగిన వెంటనే మున్సిపల్ సిబ్బంది బీజేపీకి సంబంధించిన జెండాలు తొలగించారు.



జెండాలు, ఫ్లెక్సీలు తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు

బోథ్ బాలికల పాఠశాల తనిఖీ

బోథ్: మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల సెకండరీ పాఠశాలను ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. అల్పాహార పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వారి అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. ఇష్టపడి చదివితే ఉన్నతంగా ఎదగవచ్చన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సమయపాలన పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట డీఈవో ప్రణీత, ప్రధానోపాధ్యాయులు పోశెట్టి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీఐ పునఃప్రారంభించాలని నిరసన

- అమిత్‌షా కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం

ఆదిలాబాద్‌టౌన్: జనగర్జన సభకు హాజరయ్యేందుకు వచ్చిన కేంద్రహోంశాఖమంత్రి అమిత్‌షా కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు సీసీఐ సాధన కమిటీ నాయకులు యత్నించారు. మంగళవారం జిల్లా కేంద్రానికి హెలిక్యాప్టర్‌లో వచ్చిన కేంద్రమంత్రి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి రోడ్డు మార్గంలో డైట్ మైదానంలో ఏర్పాటు చేసిన సభకు కాన్వాయ్‌లో వచ్చారు. ఈ క్రమంలో జగ్జీవన్‌రాం చౌక్‌లో సాధన కమిటీ సభ్యులు రోడ్డుపై ఉండి నిరసన తెలిపారు. నల్ల బెలూన్‌లను వదిలిపెట్టారు. సీసీఐని పునఃప్రారంభించాలని నినాదాలు చేశారు. పోలీసులు వారిని అరెస్టు చేసి మావల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందులో సీసీఐ సాధన కమిటీ సభ్యులు దత్తాత్రి, అరుణ్‌కుమార్, శివకుమార్, ప్రశాంత్, సృజన్, అఖిల్, ఆసిఫ్, సోహెబ్, రఘు, కలీం పాల్గొన్నారు.



నల్లబెలూన్లతో నిరసన వ్యక్తం చేస్తున్న సీసీఐ సాధన కమిటీ సభ్యులు

బోథ్ డివిజన్ సాధనకు 'ఆమరణ' దీక్ష



దీక్ష చేపట్టిన డివిజన్ సాధన సమితి సభ్యులు



దీక్షాపరులను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

బోథ్: బోథ్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆమరణ దీక్ష చేపట్టారు. 87 రోజులుగా రిలే దీక్షలు కొనసాగిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆమరణ దీక్షకు దిగినట్లు డివిజన్ సాధన సమితి సభ్యులు తెలిపారు. అన్ని అర్హతలున్నా బోథ్‌ను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. తమ ఆకాంక్ష నెరవేరేంత వరకు దీక్ష కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాగా ఎన్నికల సమయంలో ఆందోళన ఉధృతం చేయడంతో బోథ్‌లో కొంత రాజకీయ వేడి మొదలైంది. ఇప్పటికే కాంగ్రెస్ టికెట్ ఆశావహ నేత ఆడె గజేందర్ తాము అధికారంలోకి రాగానే బోథ్‌ను డివిజన్‌గా చేస్తామని ప్రకటించారు. బీజేపీ నాయకులు సైతం బోథ్ డివిజన్ ఏర్పాటుకు మద్దతు తెలిపారు. ఈ క్రమంలో అధికార పార్టీ నాయకుల్లో గుబులు మొదలైంది.

దీక్ష భగ్నం చేసిన పోలీసులు..

డివిజన్ సాధన సమితి సభ్యుల ఆమరణ దీక్షను పోలీసులు మంగళవారం రాత్రి భగ్నం చేశారు. ఎస్సై రాము, సిబ్బందితో కలిసి దీక్ష చేస్తున్న వారిని బలవంతంగా స్టేషన్‌కు తరలించారు. అణచివేతతో ఉద్యమాన్ని ఆపలేరని డివిజన్ ఏర్పాటయ్యేంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని సభ్యులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

మాలీల జెండా పండుగ వారోత్సవాలు ప్రారంభం


నినాదాలు చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మాలీల జెండా పండుగ వారోత్సవాలను జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్ హౌస్‌లో అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూలే ఆశయ సాధనకు 22ఏళ్ల క్రితం మొదటి సారిగా తాంసి మండల కేంద్రంలో జెండాను ఎగిరేసి మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని ఉద్యమాన్ని ప్రారంభించామన్నారు. ఆ ఉద్యమ ఫలితాలు త్వరలోనే మాలీలకు ఎస్టీ హోదా రూపంలో లభించబోతున్నాయన్నారు. పూలే దంపతుల సాహిత్యాన్ని ఉచితంగా ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గణేష్ మహారాజ్‌కు అందజేశారు. కార్యక్రమంలో మాలీ మహా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే, రాష్ట్ర కోశాధికారి సతీష్ గురునులే, మాలీ పటేళ్ల సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు గంగారాం శేండే, జిల్లా అధ్యక్షులు విజయ్, పట్టణ అధ్యక్షులు శ్రీను గురునులే, కార్యవర్గ సభ్యులు దేవిదాస్ పాల్గొన్నారు.

పంచాయతీ ట్రాక్టర్ దహనం


దహనమైన పంచాయతీ ట్రాక్టర్

ముధోల్: గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. వివరాల ప్ర కారం... మండలంలోని చించాల గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్ సోమవా రం రాత్రి దహనమైంది. దీంతో సంఘటన స్థలా న్ని మంగళవారం ఎస్సై సాయికిరణ్ పరిశీ లించారు. పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి అమిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

పేకాటరాయుళ్ల అరెస్టు

లోకేశ్వరం: మండలంలోని బిలోలి గ్రామ శివారు ప్రాంతంలోని పేకాట స్థావరంపై మంగళవారం దాడి చేసి ఏడుగురిని పట్టుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... పక్కా సమాచారం మేరకు ఎస్సై సిబ్బందితో పేకాట స్థావరంపై దాడిచేసి ఏడుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.7170ల నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన శనగారపు బుచ్చన్న ద్విచక్ర వాహనం మంగళవారం చోరీకి గురైంది. ఉదయం 10గంటల సమయంలో ఇంటి ఎదుట బైక్ పార్కింగ్ చేసి ఉండగా గుర్తు తెలియని దుండగులు వాహనాన్ని ఎత్తుకెళ్లారు. సాయంత్రం వరకు వాహనం కోసం గాలించినప్పటికీ కనిపించకపోవడంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు.

పండుగకు ప్రత్యేక బస్సులు


మంచిర్యాల డిపోలో బస్సులు

- దసరా, 'బతుకమ్మ'కు ఆర్టీసీ సన్నద్ధం
- ఆదిలాబాద్ రీజియన్ నుంచి 443..
- అక్టోబర్ 13నుంచి 23వ తేదీ వరకు..

మంచిర్యాలఅర్బన్: నష్టాలో ఉన్న సంస్థను గట్టెక్కించేందుకు ఆర్టీసీ యాజమాన్యం అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటోంది. ప్రస్తుతం దసరా, బతుకమ్మ పండులకు స్పెషల్ బస్సులు నడిపేందుకు సన్నద్ధమైంది. ఇటీవలి కాలంలో ఆర్టీసీ ఆదాయం క్రమంగా పెరుగుతోంది. అక్టోబర్ 13నుంచి 24వ తేదీ వరకు విద్యాశాఖ సెలవులు ప్రకటించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వచ్చి వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులపై దృష్టి సారించింది. పండుగ రద్దీ దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్ నుంచి డిపోల వారీగా రాజధానికి ప్రత్యేక బస్సులు తిప్పనుంది. అక్టోబర్ 13నుంచి 23వ తేదీ వరకు ఆదిలాబాద్ రీజియన్ నుంచి 443 బస్సుల ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి ఆదాయం సమకూర్చుకునేలా ప్రణాళికలు చేపట్టింది.

రద్దీకి అనుగుణంగా బస్సులు

పండుగ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి జిల్లాలోని సొంత ప్రాంతాలకు ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు వచ్చి వెళ్లనున్నారు. ప్రయాణికులకు నిరంతరం అందుబాటులో ఉండేలా జూబ్లీ బస్టేషన్‌లో ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఇద్దరు సూపర్‌వైజర్లు విధులు నిర్వహిస్తూ సమాచారాన్ని ఇవ్వనున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు రాకపోకలు సాగించనున్నాయి.

డిపోల వారీగా స్పెషల్ బస్సులు

ఆదిలాబాద్ రీజియన్‌లోని ఆరు డిపోల నుంచి పండుగ స్పెషల్ బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. నిర్మల్ నుంచి 134 బస్సులు, ఆదిలాబాద్ నుంచి 96, మంచిర్యాల నుంచి 95, కుమురంభీం ఆసిఫాబాద్ నుంచి 81, భైంసా నుంచి 32, ఉట్నూర్ నుంచి ఐదు స్పెషల్ బస్సులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చనున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి

దసరా, బతుకమ్మ పండుగల నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపేందుకు యాజమాన్యం ముందస్తు ఏర్పాట్లు చేసింది. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– రవీంద్రనాథ్, మంచిర్యాల డిపో మేనేజర్

అయా తేదీల్లో డిపోల వారీగా నడవనున్న బస్సులు

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఉట్నూర్	ఆసిఫాబాద్	మంచిర్యాల	మొత్తం
14	6	4	12	1	6	5	34
15	7	3	10	-	4	8	32
16	7	3	10	-	7	5	32
17	7	3	10	-	6	5	31
18	7	3	10	-	6	5	31
19	7	3	10	-	6	5	31
20	15	3	18	11	22	-	69
21	16	3	21	1	12	21	74
22	12	3	14	1	10	10	50
23	5	1	5	-	5	4	20

కోడ్ కూసింది.. ముసుగుపడింది

తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన మరుసటి రోజు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. రాజకీయ నాయకుల పార్టీల ఫ్లెక్సీలు, హోర్డింగ్స్, కేంద్రంలోని కూడళ్లలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ఆ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


జిల్లా కేంద్రంలోని ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది


అంబులెన్స్‌పై ఫొటోలపై స్టిక్కర్లు


ఇందిరాగాంధీ విగ్రహానికి వేసిన ముసుగు


ఎన్టీఆర్‌చౌక్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి..

బెల్ట్‌షాపులపై పోలీసుల దాడి


ఖానాపూర్: పట్టుబడ్డ మద్యం బాటిళ్లతో పోలీసులు

నిర్మల్‌టౌన్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నుంచి పోలీసులు అప్రమత్తమయ్యారు. నిర్మల్ పట్టణ శివారు కాలనీలైన శాంతినగర్, గాజుల్‌పేట్, సోఫినగర్ బెల్ట్‌షాప్‌లపై మంగళవారం పట్టణ ఎస్సై శంకర్ పర్యవేక్షణలో పోలీసులు దాడిచేశారు. ఇందులో అక్రమంగా నిల్వ ఉన్న సుమారు రూ.30వేలు విలువ చేసే 21బీరు బాటిళ్లు, 88 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ముగ్గురు నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

193 లీటర్ల మద్యం పట్టివేత..

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామంలో అక్రమంగా ఏర్పాటు చేసిన బెల్టుషాపుల్లో నిల్వ ఉంచిన మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై జి.లింబాద్రి తెలిపారు. సుమారు రూ.లక్ష విలువ గల 193 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని విక్రయదారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దాబాలపై పోలీసుల దాడులు

కుంటాల: మండలంలోని ఓలా, కుంటాల దాబా హోటళ్లపై సోమవారం అర్ధరాత్రి పోలీ సులు దాడులు నిర్వహించారు. ఓలా శాంతాబాయి దాబాలో రూ.9,240, కుంటాల రాజా దాబాలో రూ.2,400 విలువ చేసే మ ద్యాన్ని పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్సై దేవ్‌రావు ఉన్నారు.


నిర్మల్‌టౌన్: పట్టుకున్న మద్యం బాటిళ్లు

రూ.40వేల విలువ గల..

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ గ్రామంలో మంగళవారం రాత్రి నర్సాపూర్(జి) పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా బెల్ట్‌షాపుల్లో రూ.40,350 విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిర్వాహకుడు షిండే దనిత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ పేర్కొన్నారు.

ఇజ్రాయెల్‌లో ఎట్లున్నరో..?

- ఉపాధి కోసం వెళ్లిన ఉమ్మడి జిల్లా వాసులు
- యుద్ధం నేపథ్యంలో కుటుంబ సభ్యుల్లో ఆందోళన


ఇజ్రాయెల్‌పై హమాస్ బాంబు దాడి దృశ్యాలు

నిర్మల్ ఖిల్లా: గడిచిన నాలుగు రోజులుగా ఇజ్రాయెల్, పాలస్తీనా(హమాస్) దేశాల మధ్య యుద్ధం కొనసాగుతోంది. అయితే ఉపాధి కోసం ఇజ్రాయిల్ దేశానికి వెళ్లిన ఉమ్మడి జిల్లా వాసులు ఎలా ఉన్నారో అని వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. రాకెట్లు, లాంచర్ల దాడిలో వందలాది మంది మృతి చెందుతున్నట్లు ప్రసార మాధ్యమాల్లో వార్తలు వస్తుండడంతో ప్రవాస భారతీయ కుటుంబీకుల్లో అలజడి చెలరేగుతోంది. భారతదేశానికి మిత్రదేశంగా ఉన్న ఇజ్రాయెల్‌లో నిర్మల్ జిల్లా ఖానాపూర్, నిర్మల్, భైంసా తదితర ప్రాంతాల నుంచి వెళ్లిన దాదాపు 150 మంది యువకులు ఉన్నట్లు సమాచారం. దాడులు జరుగుతున్న ప్రాంతంలో వీరు పనులు నిర్వర్తిస్తున్నారు.

సాక్షితో మాట్లాడిన బాధితులు..

ఉపాధి నిమిత్తం వెళ్లిన నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండల కేంద్రానికి చెందిన ఇజ్రాయెల్ తెలంగాణ ప్రవాసీ అసోసియేషన్ సభ్యుడైన బిక్కునూరు రాజు 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. తామంతా ఇప్పటి వరకు క్షేమంగానే ఉన్నట్లు తెలిపారు. హమాస్ ఆకస్మికంగా జరుపుతున్న దాడులతో బంకర్లలో తల దాచుకుంటున్నట్లు వెల్లడించారు. నిర్మల్ జిల్లా నుంచి తమ 20 మంది సభ్యుల బృందం యుద్ధ సైరన్ మోగగానే బంకర్‌లోకి వెళ్తున్నట్లు తెలిపారు. దాడులు జరుగుతున్న సమీప ప్రాంతాలలో ఉమ్మడి జిల్లావాసులు స్వల్పసంఖ్యలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఏదైనా యుద్ధ రాకెట్, మిస్సైల్ వంటివి దూసుకొస్తున్న కొద్దీ నిమిషాల ముందు సైరన్ మోగుతుందన్నారు. వెంటనే అక్కడి సమీప ప్రాంతాల్లోని ప్రజలందరూ అప్రమత్తం కావాల్సి ఉంటుందని తెలిపారు. తాము నివసించే ప్రతి అపార్ట్‌మెంట్‌లో బంకర్ సదుపాయం ఉందని పేర్కొన్నారు.

డబుల్ ఇంజిన్ కాదు.. ట్రబుల్ ఇంజిన్

- కారు స్టీరింగ్ కేసీఆర్ చేతిలోనే ఉంది..
- బీజేపీ స్టీరింగ్ అదానీ చేతిలో ఉంది..
- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి విమర్శ

నిర్మల్‌టౌన్: తెలంగాణ ప్రభుత్వంపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన ఆరోపణలను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఖండించారు. అమిత్‌షా మాటల్లో ఒక్కటి కూడా నిజం లేదని ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీది 'డబుల్ ఇంజిన్ కాదు... ట్రబుల్ ఇంజిన్ సర్కార్' అని ఎద్దేవా చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీకి కర్రు కాల్చి వాత పెడతారని పేర్కొన్నారు. కారు స్టీరింగ్ కేసీఆర్ చేతుల్లో పదిలంగా ఉందని, బీజేపీ స్టీరింగ్ మాత్రం అదానీ లాంటి కార్పొరేట్ల చేతుల్లో ఉందని ఆరోపించారు. బీజేపీ మాటలను తెలంగాణ ప్రజలు నమ్మరని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిపై అమిత్‌షాకు కనీస అవగాహన లేదని విమర్శించారు. ఆదిలాబాద్‌లో సీసీఐ పునరుద్ధరణపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కేంద్రం నుంచి వచ్చినవారు ఒక విజన్‌తో మాట్లాడాలని సూచించారు. అమిత్‌షా.. తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని విమర్శించారు. ఆదిలాబాద్ సభలో తెలంగాణకు నిధులు ఇస్తామని, సీసీఐని పునరుద్ధరిస్తామని ప్రకటిస్తారని ఆశించారని, కానీ అమిత్‌షా రాజకీయ విమర్శలు చేసి వెళ్లిపోయారని తెలిపారు. ఆయన పర్యటనతో తెలంగాణకు ఒరిగిందేమీ లేదని పేర్కొన్నారు.

13 నుంచి జోనల్ లెవల్ క్రీడలు


లెఫ్ట్ పోచంపాడ్‌లో క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్, నిర్వాహకులు

సోన్: సోన్ మండలం టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఎస్ లెఫ్ట్ పోచంపాడ్ బాలికల పాఠశాలలో ఈనెల13 నుంచి 16వ తేదీ వరకు జోనల్‌స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు జోనల్‌స్థాయి క్రీడల నిర్వహకురాలు నీరజ, ప్రిన్సిపాల్ సరస్వతి తెలిపారు. నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలకు చెందిన 14 సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. సుమారు 1,600 మంది క్రీడాకారులు హాజరవుతారని వెల్లడించారు. ఈ పోటీల్లో విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిచేస్తామని తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వివాహిత మృతి


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కడెం: చేపల వేటకు వెళ్లి వివాహిత మృతి చెందిన సంఘటన కడెం మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని రానిగూడ గ్రామ పంచాయతీకి చెందిన సైతం గాంధారిభాయి(32) ఈ నెల 9న కడెం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందింది. మంగళవారం ఉదయం మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

జ్వరంతో కాంగ్రెస్ నాయకుడు మృతి

తలమడుగు: మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వెంకన్న యాదవ్ (43) జ్వరంతో మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... మూడు రోజులుగా వెంకన్న తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. వెంకన్నకు భార్య, కూతురు ఉంది. వెంకన్న యాదవ్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల హెచ్‌ఎంసీ కమిటీ చైర్మన్‌గా రెండుసార్లు పనిచేశాడు. కుచులాపూర్ బీసీ సంఘం అధ్యక్షుడిగా పనిచేశాడు. కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పాల్గొనే వాడు. జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మీరాజేశ్వర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

యువతి అదృశ్యం

నర్సాపూర్(జి): మండలంలోని టెంబుర్ని గ్రామానికి చెందిన పైడిపెల్లి అఖిల అనే యువతి సోమవారం రాత్రి నుంచి కనిపించకపోవడంతో ఆమె సోదరుడు పైడిపెల్లి హరీ ష్ మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫి ర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

మొసలి కలకలం..


నీళ్లలో కనిపిస్తున్న మొసలి

జైనథ్: మండలంలోని తరోడ గ్రామ సమీపంలోని వాగులో ఆదివారం సాయంత్రం మొసలి కలకలం రేపింది. ఈ వాగుపై ఉన్న పాత బ్రిడ్జి కుంగిపోవడంతో కొన్ని నెలలుగా బ్రిడ్జి మీదుగా రాకపోకలు నిలిపివేశారు. అయితే వేసవి కాలంలో వంతెన కింద మరో తాత్కాలిక వంతెన ఏర్పాటు చేసి కొన్ని రోజుల పాటు రాకపోకలు కొనసాగించారు. వర్షాకాలంలో తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో ప్రస్తుతం మరో తాత్కాలిక వంతెన నిర్మిస్తున్నారు. అయితే మంగళవారం సాయంత్రం తాత్కాలిక వంతెన పనులు కొనసాగుతున్న ప్రదేశంలోనే కొంతమంది స్థానికులకు మొసలి కనిపించింది. దీంతో మొసలిని చూసేందుకు స్థానికులు గుమ్మిగూడారు. వాగులో మొసలి కనిపించడంతో జనాలు అటుగా వెళ్లేందుకు జంకుతున్నారు.

బాసరలో శరన్నవరాత్రికి ఏర్పాట్లు


ఒడి బియ్యం లెక్కింపులో సిబ్బంది


ఆలయ పరిసరాలు పరిశీలిస్తున్న సీఐ వినోద్, ఈవో

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఈనెల 15 నుంచి 23 వరకు నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఈవో విజయరామారావుతో కలిసి ముధోల్ సీఐ వినోద్‌రెడ్డి ఆలయ ప్రాంగణాలను మంగళవారం పరిశీలించారు. పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. అక్షరాభ్యాస మండపం, క్యూలైన్లు, గర్భగుడి, ప్రధాన ఆలయం ఇలా అన్నిచోట్ల ఏర్పాట్లపై సూచనలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చినా ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు సిబ్బంది ఆలయ అధికారులతో చర్చించారు. ఎక్కడెక్కడ బందోబస్తు మోహరించాలో సీఐ వినోద్ బాసర ఎస్సై గణేశ్‌కు సూచనలు చేశారు. భక్తులకు త్వరితగతిన దర్శనమయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ అధికారులు వెల్లడించారు.

ఒడి బియ్యం హుండీల లెక్కింపు

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయ ఒడి బియ్యం హుండీలను మంగళవారం లెక్కించారు. భక్తులు ఒడి బియ్యం హుండీల్లో అమ్మవారికి కానుకలు సమర్పించారు. 29.75 క్వింటాళ్ల బియ్యం, 151 కిలోల ఎండు కొబ్బరి, 13.5 కిలోల నల్లబరడి పోకలు, 34 కిలోల పసుపుకొమ్ములు, 8 కిలోల బాదం, 29 కిలోల కర్జూర పండ్లు అమ్మవారికి కానుకలుగా భక్తులు సమర్పించారు. ఈవో విజయ రామారావుతోపాటు, వాగ్దేవి సొసైటీ సభ్యులు ఈ లెక్కింపులో పాల్గొన్నారు.

'ఏలేటి' నివాసానికి 'బండి'

నిర్మల్‌చైన్‌గేట్: ఆదిలాబాద్‌లో నిర్వహించిన బీజేపీ జనగర్జన సభకు హాజరైనా ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఇంటికి వచ్చారు. సభ అనంతరం నిర్మల్‌కు వచ్చిన బండి ఏలేటి ఇంట్లో రాత్రి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ గెలిపే లక్ష్యంగా పని చేయాలని నేతలకు సూచించారు.


ఏలేటి నివాసానికి వచ్చిన బండి